
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8। కనిష్ఠం 20.5



3

కామారెడ్డి

జిల్లా వార్తలు

బుధవారం 14 ఫిబ్రవరి 2024

24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్ష ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోనే పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు.



ఎన్నికల బదిలీలు



- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం
- మూడేళ్లు ఒకేచోట పని చేస్తున్న వారి మార్పు
- తాజాగా కామారెడ్డి, ఎల్లారెడ్డి కమిషనర్‌ల బదిలీ
- ఇటీవల జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీలకు స్థాన చలనం
- ఆర్డీవో, డీఎస్పీలకు సైతం తప్పని బదిలీలు
- సుమారు ఆరుగురు తహసీల్దార్లను బదిలీ చేసిన ఉన్నతాధికారులు
- త్వరలో ఎక్సైజ్‌శాఖలోనూ భారీగా బదిలీలు

కామారెడ్డి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో నోడల్ అధికారుల నియామకంతో పాటు ప్రవర్తన నియమావళి అమలు కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేశారు. అదేవిధంగా ఇటీవల తుది ఓటరు జాబితాను సైతం రూపొందించి ప్రకటించారు. అయితే అధికారుల బదిలీల వంతు వచ్చింది. మూడేళ్ల పాటు ఒకే చోట విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి డివిజన్ స్థాయి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖలకు చెందిన పలువురు అధికారులకు స్థాన చలనం కల్పించారు. తాజాగా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌లను సైతం బదిలీ చేశారు. త్వరలోనే ఎక్సైజ్, పంచాయతీరాజ్‌తో పాటు సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యులయ్యే శాఖల్లోనూ భారీగా బదిలీలు చేపట్టే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్రభుత్వం మారడంతో..

జిల్లాలోని పలుశాఖల్లో గత ప్రభుత్వం ప్రజాప్రతినిధుల అండతో బదిలీపై చాలా మందే అధికారులు వచ్చి పని చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పాటు సిబ్బందికి పెద్ద ఎత్తున స్థానచలనం కలిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ప్రత్యక్షంగా సంబంధం ఉండేవారితో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు, పరోక్షంగా సంబంధం ఉండే ఎంపీడీవోలను సైతం బదిలీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీవోలు కలెక్టర్‌లను కోరగా సానుకూలంగా స్పందించి వారిని బదిలీ చేయలేదు. కానీ ఇప్పుడు మూడు సంవత్సరాలు పూర్తయిన వారందరినీ మార్చాలని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో పంచాయతీరాజ్ కమిషనర్ కూడా మూడేళ్లు పూర్తయిన అధికారులను మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసు, రెవెన్యూ శాఖలో మాత్రం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే మార్చినందున ఈ ఎన్నికల నేపథ్యంలో కొందరు మినహా బదిలీలు ఉండకపోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఇద్దరు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

జిల్లాలో గత నాలుగు రోజులుగా పలు ప్రభుత్వ శాఖల్లోని జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్‌కు చెందిన కమిషనర్‌లను ప్రభుత్వం బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా దేవేందర్ నాలుగు సంవత్సరాల కిందట నియమితులయ్యారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బదిలీ జరగలేదు. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దేవేందర్‌ను రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జీవన్‌ను నారాయణ్‌ఖేడ్‌కు స్థాన చలనం కల్పించారు. అయితే కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం ఇంకా ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం స్థానిక సంస్థల అదనపు కలెక్టరే ఈ రెండు మున్సిపాలిటీల బాధ్యతలను నిర్వహిస్తారని తెలుస్తోంది.


పలువురు జిల్లా స్థాయి అధికారులు సైతం బదిలీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు జిల్లా స్థాయి అధికారులను సైతం ప్రభుత్వం బదిలీ చేసింది. అదేవిధంగా డివిజన్ స్థాయి అధికారులకు స్థాయి స్థాన చలనం కల్పించారు. జిల్లా డీఆర్‌డీవో పీడీగా పని చేసిన సాయన్నను ఆదిలాబాద్‌కు బదిలీ చేయగా జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పద్మజారాణిని నియమించారు. జిల్లా పరిషత్ సీఈవోగా పని చేస్తున్న సాయాగౌడ్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో బి.చందర్‌ను నియమించింది. కామారెడ్డి ఆర్డీవోగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డిని బదిలీ చేసి రంగనాథ్‌ను నియమించారు. బాన్సువాడ డీఎస్పీగా ఉన్న జగన్నాథ్‌రెడ్డిని బదిలీ చేయగా ఆయన స్థానంలో సత్యనారాయణను నియమించారు. అదేవిధంగా జిల్లాలోని ఆరుగురి తహసీల్దార్‌లను బదిలీచేసి మరో ఐదుగురిని కామారెడ్డికి నియమించారు. ఇలా జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలోనే ఎక్సైజ్, ఇంజనీరింగ్‌శాఖల్లోనూ బదిలీలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

నోడల్ అధికారుల నియామకం

జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ మొత్తం సంగారెడ్డి కలెక్టర్ నేతృత్వంలో కొనసాగనుంది. సంగారెడ్డి కలెక్టర్ జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌కు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఉండనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రారంభించడమే కాకుండా ఆయా జిల్లాల కలెక్టర్‌లకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిసింది. ఇప్పటికే నోడల్ అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు.

పదిలమేనా?



- పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- రోజువారీ పరీక్షలు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

భిక్కనూరు, ఫిబ్రవరి 13: విద్యార్థి జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకం. పదవ తరగతి పరీక్షల్లో గతేడాది కన్నా ఈ ఏడాది మెరుగైనా ఫలితాలను సాధించి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలన్న లక్ష్యంతో విద్యాశాఖ పక్కా ప్లాన్‌తో ముందుకు సాగుతోంది. ఇప్పటికే పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ రావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థులకు పరీక్షలంటే భయం పోయేలా ప్రతిరోజూ స్లిప్ టెస్టులు పెడుతూ చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందుకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులకు అర్థం కాని టాపిక్‌ను అర్థమయ్యేలా మరల వివరిస్తున్నారు.

> **విద్యార్థులకు పరీక్షలంటే భయం వీడేందుకు టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం**
>
> - తీగుళ్ల వేణుగోపాల్‌శర్మ, సెక్టోరియల్ అధికారి
>
> పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం వీడేందుకు నిత్యం స్లిప్‌టెస్ట్‌లను నిర్వహించడం, మాదిరి ప్రశ్నాపత్రాలను అందించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. వీటితో పాటుగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులకు అర్థం కాని టాఫిక్‌ను అర్థమయ్యే విధంగా కృషి చేస్తున్నాం. ఈ సంవత్సరం తప్పనిసరిగా విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా డీఈవో ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నాం.

జిల్లాలో 11,962 మంది పదవ తరగతి విద్యార్థులు.. 62 సెంటర్లు!

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 187 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 19 కేజీబీవీ పాఠశాలలు, 6 టీఎస్‌ఎంఎస్ పాఠశాలలు, 12 టీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు, 2 ఏయిడెడ్ పాఠశాలలు, 7 ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్ పాఠశాలలు, 3 టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ పాఠశాలలు, 6 టీఎంఆర్‌ఈఐఎస్ పాఠశాలలు, 58 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 11,962 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో 5,834 మంది బాలురు, 6,128 మంది బాలికలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థుల కోసం 62 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మార్చి 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గతేడాది కామారెడ్డి జిల్లాలో 93.32 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఈ యేడు వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాధికారులు ముందుకు సాగుతున్నారు. ఇందుకు ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎప్పటికప్పుడు టెస్ట్‌లను నిర్వహిస్తున్నారు. ఈ టెస్ట్‌ల నిర్వహణను డీఈవో రాజు, విద్యాధికారులు పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలను అందజేస్తున్నారు.

ఈ యేడు ఆరు సబ్జెక్టులు ఏడు పేపర్లు

పదవ తరగతిలో సామాన్యశాస్త్రంకు సంబంధించి భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రంకు సంబంధించి వేర్వేరుగా పాఠ్యపుస్తకాలు ఉంటాయి. వీటిని బోధించడానికి సైతం ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాలలో వేర్వేరుగా ఉంటారు. గతంలో ఈ రెండింటికీ ఒకే రోజు పరీక్ష నిర్వహించేవారు. దీంతో రెండు వేర్వేరు పాఠ్య పుస్తకాలలోని అంశాలను ఒకే పరీక్షలో రాయాలంటే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటుగా ఈ సబ్జెక్టులో చాలా మందికి తక్కువగా మార్కులు వచ్చేవి. కానీ ఈ యేడు మాత్రం సామాన్యశాస్త్రం సబ్జెక్టును రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతీ పేపర్‌కు 50మార్కుల చొప్పున ఉండనున్నాయి.

మార్చి 18 నుంచి పదవ తరగతి పరీక్షలు

మార్చి 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 18న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకెండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీష్, 23న గణితం, 26న సామాన్య శాస్త్రం మొదటి పేపర్, 28న సామాన్యశాస్త్ర రెండవ పేపర్, 30న సాంఘిక శాస్త్రం జరుగుతాయి. ఏప్రిల్ 1న, 2న ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా మార్చి మొదటి వారంలో విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షను నిర్వహించనున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు అడుగులు



రోడ్డు విస్తరణకు మార్కింగ్‌లు చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం ఆ ప్రాంతంలో 80 ఫీట్ల రోడ్డుకు గాను మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టే అవసరం ఉందని తెలిపారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న అక్రమణాలను త్వరలో తొలగించనున్నామని తెలిపారు. ఉదయం నుంచి అధికారులు మార్కింగ్‌లు చేస్తుండడంతో కొందరు కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేసిన మరికొంత మంది రోడ్డు విస్తరణ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ శ్రీనివాస్, టీపీవో గిరిధర్, టీపీఎస్ రాజేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల భైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు



స్వామి వారిని అలంకరించిన దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 13: మండలంలోని ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ గుప్తా, మాజీ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని వీడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

- ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- బీఆర్ఎస్‌లో చివరకు మిగిలేది ఆ ఎనిమిది మందేనా?
- ఇప్పటికే 4 నుంచి 18కి చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య
- అవిశ్వాసానికి అడుగులు పడనున్నాయా?

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రెండు నెలల్లోనే రాజకీయ పరిణామాలు మార్పు చెందుతున్నాయి. గత ప్రభుత్వంలో పార్టీలో ఉన్న తమకు సరైన ప్రాధాన్యత, న్యాయం జరగలేదనుకుంటున్న కొందరు ఒక్కొక్కరుగా పార్టీ నుంచి వీడుతున్నారు. దీంతో 10 సంవత్సరాల పాటు బీఆర్ఎస్‌లో వికసించిన గులాబీ రెక్కల్లా ఉన్న ఆయా ప్రజాప్రతినిధులు పార్టీ అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. ముఖ్యంగా ఆయా మున్సిపాలిటీల్లో ఎక్కువ మొత్తంలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్‌లు, చైర్మెన్‌లే ఉన్నారు. నాలుగు సంవత్సరాల పదవి కాలం పూర్తవడంతో పాటు నూతనంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లోకి వెళ్తుంటే మరికొందరు బీఆర్ఎస్‌లోనే ఉంటూ అవిశ్వాసానికి మద్దతు పలుకుతున్నారు. ఈ తరుణంలో కామారెడ్డి మున్సిపాలిటీలో సైతం అవిశ్వాసం పెడుతారని ఎప్పటి నుంచో పుకార్లు షికార్లు అవుతుంటే వాటిని నిజం చేసేలా కౌన్సిలర్‌లు ఒక్కొక్కరు బీఆర్ఎస్‌ను వీడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో నలుగురు మాత్రమే కౌన్సిలర్‌లు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్‌లు చేరడంతో ప్రస్తుతం వారి సంఖ్య 18కి చేరింది. చేరిన వారితో పాటు మరికొంత మంది కౌన్సిలర్‌లు క్యూలో ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ముఖ్య నాయకులను ఇటీవల 8 మంది కౌన్సిలర్‌లు, వారి భర్తలు కలిసి మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. మ్యాజిక్ ఫిగర్‌కు చేరగానే అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండు, మూడో రోజుల్లో అవిశ్వాసానికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చజరగనుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

బీఆర్ఎస్‌లో చివరకు మిగిలేది ఆ ఎనిమిది మందేనా?

మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు గెలువగా అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లోకి 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌ల సంఖ్య 4కు చేరింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన పలు రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియతో పాటు మరో కౌన్సిలర్ చాట్ల వంశీ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత కౌన్సిలర్‌లు రవీందర్‌గౌడ్, ఉరుదోండ వనిత, మామిండ్ల రమేష్‌లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌ల సంఖ్య 9కి చేరింది. ఆ తర్వాత గత రెండు నెలల వ్యవధిలో ఇప్పటి వరకు మరో 9 మంది కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం వారి సంఖ్య 18కి చేరింది. మరికొందరు కౌన్సిలర్‌లు సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల 8 మంది కౌన్సిలర్‌లు హైదరాబాద్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకులను కలిసి పార్టీలో చేరేందుకు చర్చించినట్లు తెలిసింది. ఇందులో ఈ వారంలో మరో నాలుగు నుంచి ఆరుగురు పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఒకరిద్దరు కౌన్సిలర్‌లు సైతం ఇప్పటికే పార్టీని వీడేందుకు సిద్ధపడగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి తీరుపై ముఖ్యనాయకులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో చేర్చుకోవద్దనే అభిప్రాయలు వ్యక్తం అయినట్లు తెలుస్తోంది. ఏది ఏమైన బీఆర్ఎస్ పార్టీలో ఒక్కొకరు పార్టీని వీడుతుండడంతో చివరికి మిగిలేది 8 నుంచి పది మంది కౌన్సిలర్‌లే ఉంటారని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్‌లు చర్చించుకుంటున్నారు.

అవిశ్వాసానికి అడుగులు పడనున్నాయా?

కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం 18 మంది కౌన్సిలర్‌లు మాత్రమే ఉండడం మరికొందరు కౌన్సిలర్‌లు పార్టీలో చేరేందుకు సిద్ధం అవుతుండడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అడుగులు పడుతున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు సైతం అవిశ్వాసానికి తాము మద్దతు తెలుపుతామని మధ్యవర్తుల ద్వారా సమాచారం చేరవేస్తున్నారని, తాము పార్టీ వీడకున్నా అవిశ్వాసానికి మద్దతు పలుకుతామని చెబుతున్నట్లు సమాచారం. అయితే అవిశ్వాసానికి మ్యాజిక్ ఫిగర్ 36 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 18 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. మరో 18 మంది మద్దతు కావాల్సి ఉంది. పార్టీలో చేరే వారితో పాటు సంఖ్య బలం తక్కువగా ఉంటే ఎవరెవరు మద్దతు పలుకుతారనే దానిపై చర్చించేందుకు ఈ రెండు మూడు రోజుల్లో ముఖ్య నాయకులతో కౌన్సిలర్‌లు చర్చించనున్నట్లు తెలిసింది. అవిశ్వాసం పెడితే చైర్‌పర్సన్‌గా చేసేందుకు వీలిన గ్రామానికి చెందిన ఓ కౌన్సిలర్ సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి పలువురు కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్పించేందుకు ఆమె కుటుంబంలోని ఒకరు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అవిశ్వాసం నెగ్గితే ఆమెకే చాయిస్ ఇస్తారా లేదా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. ఏది ఏమైనా కామారెడ్డి మున్సిపల్‌లో అవిశ్వాసంపై ఆయా పార్టీలలో ఇంటా బయట తీవ్ర చర్చ జరగడం గమనార్హం.

'పసుపు రైతులూ.. సూచనలు పాటించండి'

ఖిల్లా, ఫిబ్రవరి 13: నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చే రైతులు కింద పేర్కొన్న సూచనలు పాటించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు సీజన్ ప్రారంభం కావడంతో పసుపు అధిక మొత్తంలో మార్కెట్‌కు వస్తుందన్నారు. ఉదయం 6 నుంచి 10గంటల వరకు వచ్చే పసుపును మాత్రమే యార్డులోకి అనుమతిస్తామని, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పసుపును తీసుకురావాలన్నారు. విన్నర్ లిస్ట్ 5వేల బస్తాల వరకు ఉన్నట్లయితే 2గంటల వరకు, 10వేల బస్తాలు ఉన్నట్లయితే 3గంటల వరకు, 15వేల బస్తాలు ఉన్నట్లయితే 4గంటల వరకు ప్రకటిస్తామన్నారు. 16వ తేదీన కార్మికుల సమ్మె కారణంగా యార్డులో ఎలాంటి లావాదేవీలు జరగవన్నారు. 17న జనరల్ బీట్ మాత్రమే జరుగుతుందని పసుపు కొనుగోలు ఉండదన్నారు. 18న ఆదివారం కావడంతో సెలవు దినమని, 19వ తేదీ నుంచి పసుపు లావాదేవీలు యథా విధిగా ఉంటాయని పేర్కొన్నారు.

● పసుపునకు రూ.13వేల 666

పసుపునకు మంగళవారం 13వేల 666 రూపాయల ధర లభించిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు. 6 వేల 63 క్వింటాళ్ల పసుపు మార్కెట్‌కు వచ్చిందని వారు ఈ సందర్భంగా తెలిపారు.



● చిన్నాపూర్ గ్రామంలో డ్రైనేజీలలో స్ప్రే చేస్తున్న దృశ్యం

రోడ్లు, మురికి కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలి

● నిజామాబాద్ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, ఫిబ్రవరి 13: గ్రామాలలో రోడ్లు, మురికికాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీలో మురికినీరు నిల్వకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంకులలో క్లోరినేషన్ వేస్తూ శుభ్రపర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, ప్రత్యేక అధికారిణి ముత్తెన్న, ఎంపీటీసీ సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన జిల్లా అధికారి

వర్ని,ఫిబ్రవరి 13: మండలంలోని తగిలేపల్లి గ్రామ శివారులో పంట నమోదు ప్రక్రియను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత రాకుండా ఫైప్స్ అనే యాప్ ద్వారా మండలంలో గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల అమ్మకం, స్టాక్ నిల్వలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎరువుల డీలర్లు అందరు ఈపీవోఎస్ మెషిన్ ద్వారా మాత్రమే రైతులకు యూరియా విక్రయించాలని అన్నారు. రైతులు అధిక యూరియా వాడకం వల్ల పంటకు ఎక్కువగా తెగుళ్లు ఆశించి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో ఏవో నగేష్ రెడ్డి, ఏఈవో అరుణ్ పాల్గొన్నారు.

ఇరువర్గాలకు నోటీసుల అందజేత



ఇందల్వాయి, ఫిబ్రవరి 13: ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి తిర్మన్‌పల్లి శివారులో హైవే పక్కన గల వివాదాస్పద భూమి సర్వే నెంబర్ 728/20 భూమి కోర్టు కేసులో ఉన్నందున ఇరువర్గాల వారు ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు కానీ, కార్యక్రమాలు కానీ చేపట్టవద్దని మంగళవారం పోలీసులు ఇరువర్గాల మతపెద్దలకు నోటీసులు అందజేశారు. గత కొంతకాలంగా గిరిజనులు, ముస్లింలు ఈ భూమి కోసం పలు దఫాలు గొడవ పడినందున ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలను దృష్టిలో పెట్టుకొని శాంతిభద్రతల దృష్ట్యా ఈ భూమి కేసు కోర్టులో పరిష్కారం అయ్యేంత వరకు ఇరువర్గాల వారు అట్టి భూమిలోకి వెళ్లవద్దని నోటీసులు అందజేశారు. అంతేకాకుండా వివాదాస్పద భూమిని ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకుందని ఆర్‌డీవో జారీ చేసిన 145 సీఆర్‌పీసీ ప్రొసిడింగ్ కాపీ నోటీసులను ఇరువర్గాల పెద్దలకు అందించామని తెలిపారు. ఇట్టి వివాదాస్పద భూమి ప్రభుత్వ స్వాధీనంలోకి వెళ్లినందున ఎవరు కూడా ఆ భూమిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని అన్నారు. కోర్టు ఆదేశాలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మేడారం జాతరకు రీజియన్ నుంచి బస్సులు

● జాతరకు తరలనున్న సుమారు 270 బస్సులు ● వారం పాటు అందుబాటులో మిగిలిన బస్సులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: తెలంగాణ కుంభమేళ మేడారం జాతరకు నిజామాబాద్ రీజియన్‌కు చెందిన ఆర్టీసీ బస్సులు తరలివెళ్లనున్నాయి. తెలంగాణ ప్రాంతాల నుంచి మేడారం సమ్మక్క సారక్కలను దర్శించుకోవడానికి ప్రజలు భారీగా తరలనుండడంతో నిజామాబాద్ రీజియన్ బస్సులను ఇతర ప్రాంతాలకు తరలించనున్నారు. సుమారు 270బస్సులను ఇతర డిపోలకు తరలించనున్నారు. ఆదిలాబాద్ తదితర డిపోల నుంచి వీటిని ఆపరేట్ చేయనున్నట్లు నిజామాబాద్ రీజియన్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా వీటిలో సుమారు 600కిపైగా బస్సులు నడుపుతున్నారు. ఇందులో 270పైగా బస్సులు మేడారం జాతరకు తరలిస్తుండడంతో ఇక్కడ ఉన్న బస్సులతో ప్రయాణాలు సాగించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారనుంది. ఈనెల 21 నుంచి 26 వరకు మేడారం జాతర ఉండడంతో నిజామాబాద్ రీజియన్ నుంచి 19వ తేదీనే బస్సులు ఇతర డిపోలకు తరలించనున్నారు. 26వ తేదీ వరకు బస్సులు అక్కడనే ఉండనున్నాయి. అప్పటి వరకు మిగతా బస్సులతోనే రీజియన్ వ్యాప్తంగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. వారం రోజులపాటు బస్సులు అందుబాటులోకి లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. ఉన్న బస్సులను సైతం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో నడపనున్నారు. దీంతోపాటు ట్రిప్పులను సైతం తక్కువచేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

● ఉచిత ప్రయాణంతో కిక్కిరిసిన మహిళలు

మహిళలకు ఉచిత ప్రయాణంతోనే బస్సులు కిక్కిరిసిపోవడంతో తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ అధికారులకు మేడారం జాతరకు ఇతర డిపోలకు తరలించడం అదనపు భారంగా మారింది. దీనికి తోడు ఫిబ్రవరి నెల మొత్తం పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో ప్రయాణికుల రద్దీ సైతం ఎక్కువగా ఉండనుంది. వారం రోజులపాటు ఉన్న తక్కువ మొత్తం బస్సులతోనే ప్రయాణికులను చేరవేసేందుకు సమాయత్తం అవుతున్నారు. బస్సుల లేమితో ఆర్టీసీ అధికారులకు వారం రోజులపాటు ఇబ్బందిగా మారనుంది.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

నవీపేట,ఫిబ్రవరి13: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించనున్నారు.11సంవత్సరాల క్రితం వసంతపంచమి రోజున ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతిహోమం, అభిషేకం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కాకతీయ సత్తా

● 90 శాతానికి పైగా పర్సంటైల్ సాధించిన 17 మంది కళాశాల విద్యార్థులు



సుప్రీత్ అబ్దుల్ హదీ అబ్దుల్ మాలిక్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 : మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కాకతీయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం చదువుతూ ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్ట్‌గా ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులతో పాటు జిల్లా ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులను సాధించారు. ఎండీ మినహాజ్ 99.68 పర్సంటైల్‌తో జిల్లా ఫస్ట్, ఎం.సుప్రీత్ 99.41 పర్సంటైల్‌తో జిల్లా సెకండ్, బి.శివప్రతమ్ 99.22 పర్సంటైల్‌తో జిల్లా థర్డ్ ర్యాంకులను సాధించినట్లు విద్యాసంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. కళాశాలకు చెందిన అబ్దుల్ హదీ 98.22 పర్సంటైల్, అబ్దుల్ మాలిక్ 97.42 పర్సంటైల్, జె.కేతన 97.41 పర్సంటైల్, అనీష్ కుర్దుకర్ 97.01 పర్సంటైల్, టి.మణికాంత్ 94.65 పర్సంటైల్, ఇజాన్ తహామి 94.51 పర్సంటైల్, తాటిపల్లి రిషిక్ సాయి 94.48 పర్సంటైల్, అఖిలేష్ దూర్నాల 93.95 పర్సంటైల్, అజ్మీర తేజస్విని 93.50పర్సంటైల్, ఎం.లోకేష్ 93.34 పర్సంటైల్, వి.సాయివరుణ్ 92.39పర్సంటైల్, ఎన్.భార్గవ్ సాయి 91.63 పర్సంటైల్, టి.కౌషల్ 91.05 పర్సంటైల్, ఎండీ సయాద్ అలీ 90.48 పర్సంటైల్ సాధించడంతో పాటు 17 మంది కాకతీయ విద్యార్థులు 90 శాతంకు పైగా పర్సంటైల్‌ను సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఐఐటీ అడ్వాన్స్‌కు 50 మంది విద్యార్థులు అర్హతలు సాధించారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ జూనియర్ కాలేజీ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు (ఐఐటీయన్) మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించి తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటడంతో పాటు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని ఇందుకు కృషి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. 2022, 2023 జేఈఈ మెయిన్స్‌లోనూ కాకతీయ విద్యార్థులు జిల్లా మొదటి, రెండు, మూడవ స్థానాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అధ్యాపక బృందం, ప్రిన్సిపల్స్ రణదీష్, సందీప్‌కులకర్ణి, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కి పునాది కేవోఎస్ స్కూల్ స్థాయిలోనే..

● మినహాజ్, 99.68 పర్సంటైల్



నేను జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో ఈస్థాయి పర్సంటైల్ సాధించేందుకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్లే సాధ్యమైంది. నేను పదవ తరగతి వరకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదివాను. ఇతర స్కూళ్లలో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ పేరుతో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ప్రకటనలు పెట్టడంతో ఆ స్కూళ్లలో మా ఫ్రెండ్స్‌ని వారి తల్లిదండ్రులు చేర్పించారు. కానీ పేరు కే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ కోచింగ్ పేరుతో టైంపాస్ చేస్తూ నిజమైన ఐఐటీ మెడికల్ పై శిక్షణ ఇచ్చేవారు కాదు. ఈ ఫలితాలలో ఇతర స్కూళ్లలో చదివిన నా మిత్రులు క్వాలిఫై కాలేదు. నేను భవిష్యత్తు జాతీయ విద్యకు పక్కప్రణాళికలో ఉన్న కేవోఎస్ స్కూల్‌లో చదవడం వల్లే 99.68 పర్సంటైల్ వచ్చింది. ప్రతీ సబ్జెక్ట్‌పై ప్రతిరోజు మాకు ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై ఇంటర్ ఎంసెట్ స్థాయి లెక్చరర్స్‌తో స్కూల్ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు. దీనికి మా ఫౌండేషన్ డైరెక్టర్ రామోజీరావు కృషి ఎంతో ఉంది.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ/ మెడికల్ ఫౌండేషన్ శిక్షణ

● బి.శివప్రతమ్, 99.22 పర్సంటైల్



స్కూల్ స్థాయిలో ప్రతిరోజు ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై ఇంటర్ ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పించడం వల్లే ఈ రోజు విడుదలైన ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 99.22 పర్సంటైల్ సాధించాను. నేను పదవ తరగతి వరకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదివాను. 6వ తరగతి నుంచే పాఠశాలలో ఐఐటీ జేఈఈ మెయిన్స్‌పై శిక్షణ ఇచ్చేవారు. స్కూల్ స్థాయిలో తల్లిదండ్రులు జాగ్రత్త పడి ఎక్కడైతే ఐఐటీ ఫౌండేషన్ బాగుంటుందో ఆ పాఠశాలలో చేర్పించాలి. ప్రతీ సబ్జెక్టుపై ప్రతిరోజు లెక్చరర్లు శిక్షణ ఇచ్చేవారు. మా స్కూల్ డైరెక్టర్ సీహెచ్ తేజస్విని ప్రణాళికలు, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయి మార్కులు సాధించాను.



నవీపేట ఎంపీడీవోగా నాగనాథ్

నవీపేట,ఫిబ్రవరి13:నవీపేట నూతన ఎంపీడీవోగా ఏ.నాగనాథ్ నియామకం అయ్యారు. గతంలో నవీపేట ఎంపీడీవో పని చేసిన సయ్యద్ సాజిద్ అలీ కామారెడ్డి జిల్లాకు బదిలీ కాగా నిర్మల్ జిల్లా బాసర ఎంపీడీవోగా పని చేసిన నాగనాథ్ నవీపేట ఎంపీడీవోగా నియామకం అయ్యారు.ఈమేరకు బుధవారం ఆయనపదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మంగళవారం అసిస్టెంట్ కమిష నర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్వర్‌రెడ్డిని మున్సిపల్ కమి షనర్ మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్ అసిస్టెంట్ కమి షనర్‌గా మాత్రం ఎవరినీ నియమించలేదు.

'కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోంది'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13: నూతన జాతీయ విద్యావిధానంతో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యాను అందించకుండా కేంద్రప్రభుత్వం కాషాయీకరణ పెంచి పోషిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్‌మూర్తి అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానం ఓ విపత్తు లాంటిందని దీని నివారణకు ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపించిందని గుర్తు చేశారు. అదే విధంగా కేంద్రం రీసర్చ్ స్కాలర్ ఫెలోషిప్‌ల విషయంలో ప్రతీ సంవత్సరం కోత విధిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి 7.7 శాతం నిధులు అరకోరగా కేటాయించడం సరైందికాదన్నారు. వెంటనే కోఠారి కమిషన్ పేర్కొన్న రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.మేథోశక్తికి ఉత్పత్తి కేంద్రాలుగా వికసిలుతున్న రాష్ట్ర వర్సిటీలకు రూ.500 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వెంటనే వర్సిటీలకు అధిక ని ధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టు లను ప్రభుత్వంభర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షకార్యదర్శులు విఘ్నేశ్, అనిల్,ఉపాధ్యక్షుడు నాగరాజు, మహేశ్,దీపిక,దినేశ్, శివ, పాల్గొన్నారు

తడపాకల్ విద్యార్థులకు బహుమతులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 13: జాతీయ సైన్స్‌డే దినోత్సవాన్ని పురస్కరించుకొని లీలావ తి దవే బాలల సైన్స్ ఫిక్షన్ కథల పోటీలో తడపాకల్ విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా ఇనుప ఇల్లు అనే కథలకు బహుమతులు లభించాయని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13 : ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను వ్యాపార, వాణిజ్య వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీసీ, ఏఐపీకేఎస్, ఏఐపీఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలిన ఘటనలో ఒకరి మృతి

ధర్పల్లి, ఫిబ్రవరి13: మండలంలోని మైలారం గ్రామంలో రెండు రోజుల క్రితం సిలిండర్ లీక్ అయి పేలిన ఘటనలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రాజన్న (69) రెండు రోజుల క్రితం ఇంట్లో గ్యాస్ లీక్ అయిన విషయం తెలియక బీడీ వెలిగించడంతో ఇల్లు పేలిపోయింది. దీంతో రాజన్న ఆతని భార్యకు తీవ్రగాయాలు కాగా.. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలి

● ఎస్‌హెచ్‌వో రవికుమార్



చేపూర్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13: విద్యార్థులు చదువులో లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానంలో నిలవాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రా మంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈఆర్ ఫౌండేషన్ ప్రారంభం, ఫౌండే షన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడి మేటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను జాగ్రత్తగా గమనించాలని, మంచి మార్గంలో నడిచేలా చూడాలన్నారు. ప్రతీఒక్కరికిలో ప్రతిభ ఉంటుందని, ప్రతిభను గుర్తించి వెలికితీస్తే వారు ఆణిముత్యాలుగా తయారవుతారన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వడంలో గురువుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి లాంటి వాటిని దరచేరనివ్వోద్దన్నారు. విద్యార్థులకు ఈఆర్ ఫౌండేషన్ ద్వారా స్టడి మేటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు రాందాస్, ఎంఈవో రాజగం గారాం, మాజీసర్పంచ్ ఇందూర్ సాయన్న, హెచ్‌ఎం చేతనకుమారి, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, అర్గుల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం గరుడ పతావిష్కరణ


ఆలయంలో ధ్వజస్తంభం వద్ద గరుడ పతావిష్కరణలో భక్తులు

మెండోర, ఫిబ్రవరి13: మండల కేంద్రంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పదోవార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానఅర్చకుడు యాగశాల ప్రవేశం గరుడ పతావిష్కరణ ఎదుర్కోలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారి మేలు కొలుపు తద్వారా యాగశాల ప్రవేశం చతుస్థనార్చన అగ్నిప్రతిష్ట సంతానంలేని వారికి గరుడ ముద్దలు అందజేసి ధ్వజస్తంభం వద్ద గరుడ కల్యాణం, గరుడ పటవిష్కరణ పూజ, దేవతాహ్వానం పూజలు నిర్వహించారు. సాయంత్రం మంగళహారతులతో భజన సంకీర్తల్లో గ్రామవీధుల గుండా స్వామివారిని విష్ణుసహస్ర పారాయణం చేస్తూ ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'తెలంగాణ యూనివర్సిటీకి తక్కువ నిధులు కేటాయించడం సరికాదు'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13: రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి తక్కువ నిధులు కేటాయించడంపై పీడీఎస్‌యూ అసహనం వ్యక్తం చేస్తు పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి సోషల్ మీడియా ఇన్‌చార్జి రవీందర్‌లు మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో 15శాతం విద్యారంగానికి కేటాయిస్తామని హామీ ఇచ్చి 8శాతంలోపు బడ్జెట్ కేటాయించడం సరికాదని వర్సిటీల అభివృద్ధి కోసం కేవలం రూ.500కోట్లు కేటాయించడం సరికాదన్నారు. వర్సిటీలో ఖాళీ గా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వర్సిటీలో ఆడిటోరియం, హెల్త్ సెం టర్, మినీ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో వర్సిటీ పీడీఎస్‌యూ సభ్యులు అక్షయ్, హన్మండ్లు, ఆకాశ్, పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి'

డొంకేశ్వర్, ఫిబ్రవరి13: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని భూములను రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రిలే నిరహర దీక్ష గ్రామస్థులు చేస్తున్నారు. ఈ విషంపై అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించు కోవడం లేదన్నారు. భూమిని కాపాడాలని ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లామని వాపోయారు. భూమిని కాపాడాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు.అధికారులు ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

సాలూర, ఫిబ్రవరి 13: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు మీసాల నగేష్ అన్నారు. బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5,300 కోట్లకు పైగా స్కాలర్ షిప్స్, ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు రావాల్సిన బకా యిలను అందజేయాలని డిమాండ్ చేశారు.

పొతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,ఫిబ్రవరి13: పొతంగల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా రాత్రి వేళ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీలను సీజ్ చేసిన అధికారులు

ఎడపల్లి, ఫిబ్రవరి 13: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడిచేసి రెండు జేసీబీలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శేఖర్ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాత్రి వేలల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో రాణాకలాన్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న స్థావరాలపై దాడిచేయగా రెండు జేసీబీలతో మొరం తవ్వకాలు జరుపుతున్న జైతాపూర్ గ్రామానికి చెందిన రాము, మరో ఇద్దరు జేసీబీ డ్రైవర్లను అరెస్టు చేసి రెండు జేసీబీలను, మూడు టిప్పర్‌లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిఐలు అంజయ్య, అజయ్‌బాబులు ఉన్నారు.

సేవాలాల్ జయంతి సందర్భంగా వాలీబాల్ టోర్నీ

సిరికొండ, ఫిబ్రవరి 13: ఈనెల 15న సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లస్కర్ తెలిపారు. మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడల పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు చందర్, గణేష్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: రానున్న లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా దుగ్గి విజయ్, ఆరే రాజేశ్వర్, దోండి ప్రకాష్, ఎంజె.రమేష్, బోచ్‌కర్ పద్మ, వంగ వివేక్, దుంపల నగేష్, ప్రధానకార్యదర్శులుగా పొల్కం వేణు, పులి యుగంధర్, కార్యదర్శులుగా ఖాం దేశ్ ప్రశాంత్, శ్రీకుమార్, మిర్యాల్‌కర్ కిరణ్, పల్లె శీను, పడిగెల సురేందర్, చెన్నారెడ్డి, శివగౌడ్, కోశాధికారిగా ధన్‌పాల్ శివకుమార్, కార్యవర్గసభ్యులుగా పిట్ల శ్రీధర్, మర్రి రాజు, డల్లీ దేవేందర్, జాగర్ల గంగాధర్‌లను నియామించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి,సీనియర్ నాయకులు కలిగోట గంగాధర్, యామాద్రిబాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. తృటిలో తప్పిన ప్రమాదం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13: బోధన్ పట్టణంలోని పసుపు వాగు వద్ద మంగళవారం రాత్రి లోడ్‌తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఏం ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో తృటిలో ప్రాణపాయం తప్పినట్లయింది. లారీ బోల్తా పడ్డ విషయం తెలుసుకున్న సీఐ వీరయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై విచారణ చేపడుతున్నామన్నారు. లోడ్‌తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఎవరికి ఏమి కాకపోవడంతో తృటిలో ప్రాణపాయం తప్పినట్లయిందని బోధన్ సీఐ తెలిపారు.

అయోధ్యకు తరలిన బీజేపీ కార్యకర్తలు

సిరికొండ, ఫిబ్రవరి 13: అయోధ్యలో బాలరాముని దర్శించుకోవడానికి బీజేపీ నాయకు లు, కార్యకర్తలు మంగళవారం అయోధ్యకు తరలివెళ్లారు. మండలానికి చెందిన బీజేవైఎం అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయగౌడ్, సతీష్, మురళి, తదితరులు జిల్లా అధ్యక్షులు దినేష్ ఆధ్వర్యంలో అయోధ్యకు తరలివెళ్లారు.





బీర్కూర్ నుంచి బాసరకు పాదయాత్రగా తరలివెళుతున్న భక్తులు

బీర్కూర్ నుంచి బాసరకు మహా పాదయాత్ర

బీర్కూర్, ఫిబ్రవరి 13: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బీర్కూర్ మండల కేంద్రం నుంచి గురుస్వామి సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు మహా పుణ్య క్షేత్రమైన బాసరకు మహా పాదయాత్రను చేపట్టారు. బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో గల హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద హావారి గంగారాం జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రతీయేటా వసంత పంచమి సందర్భంగా బీర్కూర్ నుంచి చదువుల తల్లి కొలువు దీరిన బాసర వరకు పాదయాత్రను నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుందన్నారు. గత తొమ్మిదేళ్లుగా నిర్విరామంగా పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. బుధవారం బాసరలో అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతామన్నారు. పాదయాత్రకు తరలి వెళ్లిన వారిలో లింగం, బాలకృష్ణ, డాక్టర్ బాలకృష్ణ, రాజేందర్, రాజు, విఠల్, గోపాల్, గోపి, ఆకాష్‌కుమార్, సంతోష్, యోగేష్ తదితరులు ఉన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

● ఆర్డీవో భుజంగ్‌రావు



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 13: తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆర్డీవో భుజంగ్‌రావు అన్నారు. మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రాజు బదిలీపై వెళ్లడంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలకు రైతులకు అందుబాటులో ఉన్నారా, లేదా అని తెలుసుకోవడానికి కార్యాలయాన్ని తనిఖీ చేశామన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న భూగర్భజలాల జిల్లా అధికారి సతీష్‌యాదవ్

భూగర్భ జలాల నిర్వహణపై అవగాహన

మాచారెడ్డి, ఫిబ్రవరి 13: మండలంలోని భవానిపేటలో భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణపై రిలయన్స్ ఫౌండేషన్, భూగర్భజలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి సతీష్‌యాదవ్ మాట్లాడుతూ భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణపై నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కింద రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. భూగర్భ జలాల యొక్క ప్రాముఖ్యత, వాల్టా చట్టం, భూగర్భజలాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, జిల్లా పశువైద్య అధికారి సింహారావు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజు, గ్రామ ఎంపీటీసీ, మాచారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలి

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 13: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా ఏర్పాట్లు చేయాలని బిచ్కుంద సీఐ జగడం నరేష్ పోలీసు అధికారులకు సూచించారు. గత ఐదు రోజుల కిందట మండలంలోని కౌలాస్ ఎల్లమ్మ గేట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. దీంతో ప్రమాదం జరిగిన స్థలాన్ని సీఐ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదం జరగకుండా రహదారి క్రాసింగ్‌ల దగ్గర స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేగాక చౌరస్తాల వద్ద మెర్క్యురీ లైట్లు ఏర్పాటు చేయాలని ఎస్ఐని ఆదేశించారు. ఇక వాహనదారులకు రహదారిపై భద్రత, ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కోనారెడ్డి, ఎంపీడీవో రాణి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: హత్యానేరం కేసులో నిందితునికి జీవిత ఖైదును న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. 2022 డిసెంబరు 9న బిచ్కుంద మండలం వాజీద్ నగర్ గ్రామానికి చెందిన కుమ్మరి చిన్నబాలయ్య జులాయిగా తిరుగుతూ మద్యానికిబానిసై తన భార్య అంజవ్వను డబ్బుల కోసం వేధించడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె మెడపై నరకడంతో అంజవ్వ అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి అక్క కొడుకు కుమ్మరి అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ వేయడంతో విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితునికి జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారని తెలిపారు. నిందితునికి శిక్ష పడేవిధంగా కృషి చేసిన పీపీ నంద రమేష్, బిచ్కుంద సీఐ కృష్ణ, ప్రస్తుత సీఐ నరేష్, కోర్టు హెచ్‌సీ విక్రమ్ రెడ్డి, గోపి, విఠల్, హన్మండ్లును అభినందిస్తున్నానని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: కామారెడ్డి పట్టణ శివారులోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి నట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. పేకాట ఆడుతున్న బాలకృష్ణ, అంకలం నరేందర్, రాపర్తి రాజులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.2240లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

బాగిర్తిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● ఏడున్నర తులాల బంగారం, 31 తులాల వెండి చోరీ

● సంఘటన స్థలంలో వేలిముద్రలను సేకరించిన క్లూస్‌టీం



సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 13: తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసుకుని దొంగలు ఇంట్లో ఉన్న బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లిన సంఘటన భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు నీల కుమార్, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీల కుమార్‌కు గ్రామంలో రెండు ఇళ్లు ఉండగా ప్రస్తుతం నూతనంగా నిర్మించుకున్న ఇంట్లో కుటుంబంతో కలిసి ఉంటున్నారు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావికి సమీపంలో ఉన్న పాత ఇంటిలో ఉంటున్నారు. వ్యవసాయ పనులను ముగించుకుని మంగళవారం ఉదయం ప్రస్తుతం నివసిస్తున్న నూతన ఇంటికి వెళ్లగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. కంగారు పడి ఇంట్లోకి వెళ్లిన వారికి బీరువా తెరిచి, సామాన్లు చిందరవందరగా ఉండి బీరువాలో దాచి ఉన్న ఏడున్నర తులాల బంగారు, 31 తులాల వెండి నగలు కనబడలేదు. దీంతో లబోదిబోమంటూ భిక్కనూరు పోలీసులకు, గ్రామపెద్దలకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం అందజేశారు. క్లూస్‌టీం చేరుకుని బీరువాపై, ఇతర వస్తువులపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ బాధితుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని, చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: కామారెడ్డి పట్టణంలోని దేవి విహార్ వద్ద టీవీఎస్ ఎక్స్‌ఎల్ బైక్‌పై వెళ్తున్న తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన బుయ్య మల్లయ్యను డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. బుయ్య మల్లయ్య పనిమీద కామారెడ్డి వైపునకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వస్తుండగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపునకు వస్తున్న డీసీఎంను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తతో నడపి ఎక్స్‌ఎల్‌కు ఢీకొట్టడంతో మల్లయ్య బైక్ నుంచి కిందపడి తలపగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ల బదిలీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌లు బదిలీ అయ్యారు. కామారెడ్డి కమిషనర్ దేవేందర్‌ను రామాయంపేట, ఎల్లారెడ్డి కమిషనర్‌ను నారాయణఖేడ్‌కు బదిలీ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఇంకా ఎవరిని కేటాయించలేదు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు బాధ్యతలను అప్పగించనున్నారు. నూతన మున్సిపల్ కమిషనర్ వచ్చే వరకు మున్సిపల్ కార్యాలయంలోని సీనియర్ అధికారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 13: మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి నిలుస్తుందని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

రేపు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

దోమకొండ: మండలంలోని సంగమేశ్వర్ శ్రీ వెంకటేశ్వర స్వామి 11వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవదాయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయం ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవచనము, నవగ్రహ దీపాలు, హోమ కార్యక్రమం 11 గంటలకు శ్రీ గోదాదేవి పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణం మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం పల్లకి సేవ, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.



కొచ్చేరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

లింగంపేట, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ల చిత్రపటానికి గిరిజనులు క్షీరాభిషేకం చేశారు. గిరిజనుల ఆరాధ్యదైవమైనసేవలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించడంతో వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బంజారా సేవాసంఘం మండల అధ్యక్షుడు గన్నునాయక్, నాయకులు దశరథ్, పూల్‌సింగ్, పీర్‌సింగ్, రఘుపతి, ఈశ్వర్, శివరాం, జగ్యాలతో పాటు గిరిజనులు ఉన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

దోమకొండ, ఫిబ్రవరి 13: విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడానికి పాటశాలలోని ప్రతి ఒక ఉపాధ్యాయురాలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపల్లి కస్తూర్బ గాంధీ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం బోజనం పెట్టలన్నారు. జీఈసీవో ఉమారాణి, ఎంఈవో ఎల్లయ్య, స్పెషల్ ఆఫీసర్ మమత పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నిజాంసాగర్, ఫిబ్రవరి 13: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్నాయని, పనులను సిబ్బంది బాగా చేయాలని సూచించారు. పారిశుధ్య వారోత్సవాలు నేటితో ముగుస్తాయని తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని సాయిబాబా 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఆలయ కమిటీతో పాటు, భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాయిబాబా ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం, కొట్టాల గడ్డ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'100 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలి'

దోమకొండ, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో ఉన్నటువంటి 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాడానికి కృషి చేయాలని కోరుతూ మంగళవారం దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ప్రతీరోజు ఆసుపత్రికి 350 మంది వరకు దోమకొండతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి అవుట్ పేషెంట్లు ప్రతీరోజు 30 మంది వరకు ఇన్ పేషెంట్లు వస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దోమకొండలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రామస్వామిగౌడ్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 13: సేవాలాల్ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించాలని డీఈవోరాజుకు మంగళవారం ఎస్‌సీఎస్‌టీ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాదావత్ ప్రవీణ్‌నాయక్ మాట్లాడుతూ ఎంతోమంది గిరిజనులకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితబోధ చేసిన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్‌కు రుణపడి ఉంటామని తెలిపారు.

పెంచిన వేతనాన్ని కార్మికులందరికీ వర్తింప జేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాలను అమలు చేయాలని కోరుతూ కమిషనర్ దేవేందర్‌కు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ అలీలు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచినవేతనాన్ని వెంటనే అమలు చేయాలని కోరామన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణ పనుల ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 13: మండలంలోని పెద్దఏడ్గి గ్రామంలో మంగళవారం పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు వినోద్ మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ అవసరం ఉందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ దృష్టికి తీసుకరావడంతో స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని తెలిపారు. దీంతో పాటుగానే గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులకు నిధులు అవసరం ఉన్నాయని తెలుపగా, ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని, గ్రామంలో అవసరమైన పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్ పటేల్, అనిల్, అరుణ్, సాయిలు, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 13: మండలంలోని జప్తి జానకంపల్లి - బెజ్జం చెరువు తాండల మధ్య నిర్మాణం జరిగే కల్వర్టు నిర్మాణం పనులను మంగళవారం స్థానిక జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. జప్తిజానకంపల్లి ఊర చెరువు నుంచి బెజ్జం చెరువు తాండవరకు కోటి 24 లక్షల రూపాయలు వ్యయంతో సుమారు 2 కిలో మీటర్ల 800 మీటర్ల పొడవు బీటీ రోడ్డు మంజూరైందని ఆయన తెలిపారు. బీటీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. జడ్పీటీసీ వెంట మాజీ సర్పంచ్‌లు కృష్ణ, సాయిలు, నాయకులు ధనుంజయ్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రామేశ్వర్‌పల్లి వీడీసీ చైర్మన్‌గా మద్ది సూర్యకాంత్‌రెడ్డి

భిక్కనూరు, ఫిబ్రవరి 13: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షుడిగా మద్ది సూర్యకాంత్‌రెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఏలేటి రమేష్‌రెడ్డి, బడ్డె శశి, చేపూరి రమేష్, ప్రధాన కార్యదర్శిగా నాగర్తి భూంరెడ్డి, కోశాధికారిగా తక్కళ్ల శ్యాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన గ్రామాభివృద్ధి పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ పూర్తి సమయాన్ని కేటాయిస్తామన్నారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాజారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేయాలి'

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ కలెక్టరేట్ వైపు వెళ్లె దారిలో ఉన్న హాస్టల్‌ల వద్ద ఆకతాయిలు చేస్తున్న వికృత చేష్టలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఏబీవీపీ నాయకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాత్రిపూట కొంతమంది యువకులు బైక్‌లపైన చక్కర్లు కొడుతూ అమ్మాయిలను ఇబ్బందులు పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్, రోహిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన పోతాయిపల్లి పద్మ (43) కూలి పని చేసుకుంటూ ఉంటుంది. భర్త శ్రీనివాస్ వాళ్ళ అమ్మతో ఆస్తి విషయంలో మాట్లాడుతుండగా మధ్యలో తల దూర్చడంతో శ్రీనివాస్ ఆయన భార్య పద్మను మందలించడంతో సోమవారం ఉదయం భార్య ఇంట్లో కనిపించడం లేదని భర్త శ్రీనివాస్ ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో సాందీపని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల డైరెక్టర్ బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శరత్‌చంద్ర, నందీశ్వర్‌రెడ్డి, వైష్ణవ్ చంద్రలతో పాటు మరికొందమంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు.

చెట్టును ఢీకొని ఒకరి మృతి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: చెట్టును ఢీకొని ఒకరి మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జడల నరేష్ (32) అనే వ్యక్తి రెండు రోజుల క్రితం భార్య పిల్లలతో కలిసి ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్ గ్రామానికి వారి అత్తగారి ఇంటికి వారి బంధువుల శుభ కార్యానికి వెళ్లారు. నరేష్‌కు ట్యాబ్లెట్ల కోసం ఆయన బావ మరిది అరవింద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం ఎల్లారెడ్డి పట్టణానికి రాత్రి 10 గంటలకు వెళుతుండగా మీసన్ పల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టడంతో పడిపోయాడు. నరేష్‌కు బలమైన గాయాలు కావడంతో ఆయనతో పాటు వెళ్లిన అరవింద్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు వచ్చి ఎల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే నరేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 13: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన పంపరి బాలనర్సు (33) అనేయువకుడు చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం చేపలు పట్టేందుకు కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన బాలనర్సు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వెతికారు. సోమవారం మధ్యాహ్నం చెరువు వద్దకు వెళ్లి వెతుకగా ఆయన చెప్పులు, బట్టలు, సెల్‌ఫోన్ ఒడ్డున కనపడడంతో తమకు సమాచారం అందించారని తెలిపారు. మంగళవారం సాయంత్రం బాల నర్సు మృతదేహం నీటిపై తేలికనబడిందని వెంటను ఒడ్డుకు చేర్చగా రెండు కాళ్లకు వల చుట్టుకుపోవడంతో నీటిలో పడి ఊపిరాడక మృతిచెందినట్లు గుర్తించామని తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

దోమకొండ, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కష్టపడి చదవుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు చింతల రాజేష్, శరత్, శ్రీకాంత్, రేఖ, నవీన్, శ్రీధర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ బదిలీ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్లారెడ్డిలో పని చేసిన మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను నారాయణఖేడ్‌కు బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు సమాచారం. ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ప్రమాదాలకు కారణమవుతున్న డివైడర్‌ను మూసి వేయాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 13: ప్రమాదాలకు కారణమవుతున్న భిక్కనూరు గ్రామంలోని చర్చి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను మూసి వేయాలని భిక్కనూరు శ్రీరామ దండు సభ్యులు, గ్రామ పెద్దలు మంగళవారం భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్, గ్రామ పంచాయతీ అధికారులకు వినపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిక్కనూరు చర్చి చౌరస్తా వద్ద 44వ జాతీయరహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో చాలా మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు, జీఎంఆర్, జీఎంఆర్ అధికారులు స్పందించి ఈ ప్రమాదాలకు కారణమవుతున్న డివైడర్‌ను మూసివేయాలని కోరారు. ఈ డివైడర్‌ను మూసివేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని రామేశ్వర్‌పల్లి బ్రిడ్జి గుండా తమ ప్రయాణాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ దండు ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భిక్కనూరు టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడిగా నర్సాగౌడ్ ఎన్నిక

భిక్కనూరు, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడి ఎన్నికను మంగళవారం నిర్వహించారు. బ్యాలెట్ ద్వారా నిర్వహించిన ఈ ఎన్నికల్లో నర్సాగౌడ్, పెంటాగౌడ్, పుల్లూరి అంజీ పోటీపడగా నర్సాగౌడ్ 24 ఓట్ల తేడాతో పెంటాగౌడ్‌పై గెలుపొందాడు. ఈ ఎన్నికల్లో నర్సాగౌడ్‌కు 42ఓట్లు రాగా పెంటాగౌడ్‌కు 18, అంజీకి 15ఓట్లు వచ్చాయి. అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందిన నర్సాగౌడ్ మాట్లాడుతూ టోల్‌ప్లాజా కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. టోల్‌ప్లాజా కార్మికుల పక్షాన ఎల్లప్పుడు ముందుండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - హనుమాన్

శాంతి - గుంటూరు కారం

ప్రియా 70 - ఈగల్, లాల్ సలాం

ప్రియా 35 - యాత్ర-2

బాన్సువాడ

మహేశ్వరి - ఈగల్

వెంకటేశ్వర - లాల్ సలామ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

